మౌలిక వసతుల కల్పనే ప్రథమ కర్తవ్యం

- మేయర్ గొలగాని హరి వెంకట కుమారి



33వ వార్డులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ గొలగాని హరివెంకటకుమారి. చిత్రంలో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, కార్పొరేటర్ వసంతలక్ష్మి తదితరులు

అల్లిపురం : మౌలిక వసతుల కల్పనే ప్రథమ కర్తవ్యమని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి అన్నారు. నాల్గవ జోన్ 33వ వార్డులో సాయిబాబావీధి, బంగారుమెట్ట, అమ్మవారివీధి తదితర ప్రాంతాల్లో సుమారు రూ.42.36 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్లు, సీసీ కాలువల నిర్మాణానికి శనివారం ఆమె ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, వార్డు కార్పొరేటర్ భీశెట్టి వసంతలక్ష్మితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో ప్రతి వార్డులో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. 33వ వార్డులో ఇప్పటికే చాలా అభివృద్ధి కార్యక్రమాలు చేశామన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో విశాఖ నగరాన్ని సుందర నగరంగా తీర్చిదిద్దేందుకు అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. త్వరలో విశాఖ నుంచి పరిపాలన కొనసాగేందుకు అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. విశాఖ పరిపాలన రాజధానిగా జరిగితే నగరం మరింత అభివృద్ధి చెంది ఎంతోమందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి వార్డును అభివృద్ధి చేయడమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. విశాఖ అభివృద్ధి వైఎస్సార్‌సీపీ పార్టీతోనే జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు రంధి గోపికృష్ణ, నీలమ్మ వేపచెట్టు దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ బొర్రా విజయలక్ష్మి, సీనియర్ నాయకులు బొడ్డేటి ప్రసాద్, బొర్రా శ్రీనివాసరెడ్డి, రాజు, మాదాబత్తుల రమేష్, పార్టీ కార్యకర్తలు, జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

ఫొటో ప్రదర్శన పోస్టర్ ఆవిష్కరణ



ఫొటో ప్రదర్శన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కమిషనర్ సాయికాంత్‌వర్మ, ఫొటోగ్రాఫర్లు

డాబాగార్డెన్స్ : వైజాగ్ ఫొటో జర్నలిస్టుల అసోసియేషన్ ఈ నెల 19న విశాఖ మ్యూజియంలో ఏర్పాటు చేయనున్న ఫొటో ప్రదర్శన పోస్టర్‌ను జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు పి. నరసింహమూర్తి, కార్యదర్శి తిరుపతిరావు, ప్రతినిధులు రామకృష్ణ, ఎండీ నవాజ్ మాట్లాడుతూ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి ఏటా వైజాగ్ ఫొటో జర్నలిస్టుల అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహిస్తూ వస్తున్నామన్నారు. ఫొటో ప్రదర్శనలో వివిధ పత్రికల్లో పనిచేస్తున్న 26 మంది ఫొటోగ్రాఫర్లు తీసిన..సమాజానికి..పర్యాటక ప్రాంతంగా విరాజిల్లుతున్న విశాఖ అందాలతో కూడిన చిత్రాలను ప్రదర్శనలో ప్రదర్శించనున్నట్టు చెప్పారు. 19, 20 తేదీల్లో విశాఖ ప్రజలకు అందుబాటులోకి ఈ ప్రదర్శన ఉంటుందని, ఫొటో ప్రదర్శనను జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ ప్రారంభించనున్నారని తెలిపారు.

క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరానికి చక్కటి స్పందన



పరీక్షలు చేయించుకుంటున్న స్థానికులు

అల్లిపురం : వైఎస్సార్‌సీపీ నాయకులు సీతంరాజు సుధాకర్ సహకారంతో శనివారం బంగారుమెట్ట సచివాలయం వద్ద వార్డు అధ్యక్షుడు రంధి గోపీకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి చక్కటి స్పందన లభించింది. శిబిరంలో బీపీ, షుగర్, ఈసీజీ వంటి పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. సుమారు 260 మంది పరీక్షలు చేయించుకున్నారు. సచివాయ కన్వీనర్ ఆడారి వెంకట మహేష్, భీశెట్టి రాజు, మైనార్టీ సెల్ అధ్యక్షుడు మదీనాఖాన్, బూర్ల చిన్న, బూర్ల అరుణ, ఆర్పీ రామలక్ష్మి, సంతోష్, ఆశ వర్కర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో 8 మంది పేకాటరాయుళ్లు

అల్లిపురం : టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఎ.త్రినాథరావు తెలిపిన వివరాల ప్రకారం నగర పోలీస్ కమిషనర్ త్రివిక్రమవర్మ, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేంద్రుడు ఆదేశాల మేరకు సూర్యాబాగ్‌లో గల సిరి గ్రాండ్ హోటల్ 109 రూమ్‌లో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు దాడి నిర్వహించారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.63,200 నగదు, 8 మొబైళ్లు, ప్లేయింగ్ కార్డులు స్వాధీనం చేసుకుని టూటౌన్ పోలీసులకు అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కార్యకర్తల సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్



కార్యకర్తల కోసం గ్రీవెన్స్ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

డాబాగార్డెన్స్ : పార్టీ కార్యకర్తల సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్ నిర్వహించినట్టు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ తెలిపారు. ఆశీల్‌మెట్ట అశోక్‌నగర్‌లో గల పార్టీ కార్యాలయంలో శనివారం ప్రత్యేకంగా పార్టీ నాయకులు, కార్యకర్తల కోసం గ్రీవెన్స్ నిర్వహించారు. టిడ్కో ఇళ్లు మంజూరు చేయాలని కార్యకర్తలు కోరిన మేరకు కలెక్టర్ డాక్టర్ మల్లికార్జునతో మాట్లాడి, అనకాపల్లి జిల్లా ఎస్ఎస్ పురం, సిరసపల్లి, కొండకొప్పాకలో దక్షిణ నియోజకవర్గం లబ్ధిదారులకు మంజూరు చేసిన 1534 ఇళ్లు అందజేయాలని, లేనిచో ఇంటి స్థలాలు కేటాయించాలని ఎమ్మెల్యే కోరారు. 30వ వార్డు కార్పొరేటర్ కోడూరు అప్పలరత్నం, మూలే రామిరెడ్డి, పీతల వాసు, పెంటపల్లి సత్యనారాయణ, బొగ్గు శ్యామ్, ఆదివిష్ణు, లండా రమణ, బొర్రా శ్రీనివాసరెడ్డి, కోరాడ సురేష్, భానుమూర్తి, కృష్ణవేణి, దేవుడు, లక్ష్మీభవాని, రామరాజు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

క్రైస్తవులపై దాడులను నిరసిస్తూ ధర్నా



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న జాన్‌వెస్లీ, లుథియానాపాల్ తదితరులు

సీతమ్మధార : మణిపూర్‌లో క్రైస్తవులపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా సిస్టర్ లుథియానా పాల్, ఎమెన్ ఇన్‌క్రైస్ట్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద క్రైస్తవ మహిళలు ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ స్టేట్ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ బొల్లవరపు జాన్‌వెస్లీ హాజరై మాట్లాడారు. మణిపూర్‌లో మూడు నెలలుగా జరుగుతున్న మారణహోమంలో 175 మంది ప్రాణాలు కోల్పోయారని, 60 వేల మంది నిరాశ్రయులయ్యారని అన్నారు. ఇలాంటి చర్యల వల్ల ప్రపంచ దేశాల్లో మన దేశం చులకన అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిస్టర్ హెప్సిబ, సాల్మన్ ప్రసన్న, సూథీనాపాల్, రూతు, షైనీ, ప్రిస్కిల్లా, అభిషేక్, రాజేంద్రప్రసాద్, క్రైస్తవులు పాల్గొన్నారు.

పార్కుల అభివృద్ధికి సహకరించండి

డాబాగార్డెన్స్ : పార్కుల అభివృద్ధికి సహకరించాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ నగరంలోని పార్కుల అసోసియేషన్ సభ్యులకు విజ్ఞప్తి చేశారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో గల సమావేశ మందిరంలో శనివారం నగరంలో గల పార్కుల అసోసియేషన్ ప్రతినిధులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. జీవీఎంసీ పరిధిలో సుమారు 143 పార్కులున్నాయని, వాటిలో దాదాపు 80 పార్కులు అసోసియేషన్ సభ్యులు నిర్వహిస్తున్నారని తెలిపారు. మిగిలిన పార్కులను ఆయా ప్రాంత రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు దత్తత తీసుకొని నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. పార్కుల అభివృద్ధికి జీవీఎంసీ సహరిస్తుందని, వాటి నిర్వహణ ఆయా ప్రాంత రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులే చూడాలని కోరారు. అనంతరం పార్కుల అసోసియేషన్ సభ్యులు పార్కుల్లోని సమస్యలపై కమిషనర్‌కు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో హార్టీకల్చర్ డీడీ దామోదర రావు, రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

కిడ్నీ బాధితురాలికి ఆర్థిక సహకారం

అల్లిపురం : బంగారుమెట్ట కాలనీకి చెందిన ఎజ్జివరపు లీల గత కొంత కాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న దక్షిణ నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ నాయకుడు సీతంరాజు సుధాకర్ అందించిన రూ. 5 వేల ఆర్థిక సహకారాన్ని 33వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు రంధి గోపీకృష్ణ, సచివాలయ కన్వీనర్ ఆడారి వెంకట మహేష్, భీశెట్టి రాజు, మదీనాఖాన్, చంద్రకళ, సంతోష్ శనివారం బాధితురాలి ఇంటికి వెళ్లి అందజేశారు.

ఘనంగా హరిత భారత్

డాబాగార్డెన్స్ : శ్రీచైతన్య ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో స్మార్ట్ లివింగ్ ప్రోగ్రామ్‌లో భాగంగా శనివారం హరిత భారత్ పేరిట మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో విశాఖ ఈస్ట్ ట్రాఫిక్ సీఐ సీహెచ్ సూరినాయుడు పాల్గొని పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. మొక్కల పెంపకం ప్రతి ఒక్కరూ బాధ్యతగా గుర్తించాలని పిలుపునిచ్చారు. అనంతరం ఇటీవల నాసా స్పేస్ కాంటెస్ట్ విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. శ్రీచైతన్య పాఠశాల పట్టణ ఆర్ఐ అలీ, ప్రిన్సిపాల్ మండ సూర్యనారాయణ మూర్తి, డీన్ సంతోష్, ఇన్‌చార్జిలు చంద్రశేఖర్, స్వామినాయుడు, ప్రవీణ్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

శిథిల గృహాల పరిశీలన



చిలకపేట వద్ద గోడ కూలిన ఇంటి పరిసరాలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సాథిక్

జగదాంబ : ఇటీవల కురిసిన వర్షాలకు శిథిలమైన ఇళ్లను కార్పొరేటర్ మహ్మద్ సాథిక్ పరిశీలించారు. జీవీఎంసీ 39వ వార్డులోని వీధుల్లో కార్పొరేటర్ పర్యటించి సమస్యలను గుర్తించారు. కూలిన గోడలు, శిథిలమైన కాలువలు, యూజీడీ డ్రైన్లకు మరమ్మతు చేయిస్తామన్నారు. కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

జగదాంబ : పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని కార్పొరేటర్ మహ్మద్ సాథిక్ అన్నారు. శనివారం జీవీఎంసీ 39వ వార్డు అంబుసరంగు వీధిలో గల అంగన్‌వాడీ కేంద్రంల్లో జరిగిన పౌష్టికాహార వారోత్సవాలలో వైఎస్సార్ సంపూర్ణ ఆరోగ్య పోషణ కిట్లు పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అందరికీ సమన్యాయం చేస్తున్నారన్నారు. అంగన్‌వాడీల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న పోషణ కిట్లు, డ్రైరేషన్ వల్ల రక్తహీనత తొలగి ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఏ ప్రభుత్వాలు చేయని సంక్షేమం జగనన్న ప్రభుత్వం చేస్తుందన్నారు. వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.